

# మ్యూజికల్ మ్యూజింగ్స్
## - కస్తూరి మురళీకృష్ణ



**అజీబ్ జిందగీ హై యే**
**కభీ ఖుషీ కభీ హై గం**
**వో మంజిలే బదల్ గయీ**
**కహా థె హమ్, కహా హై హమ్!**

ఈ పాట అంతగా ప్రాచుర్యం పొందలేదు. ఎవరో కొద్దిమంది మహమ్మద్ రఫీ అభిమానులకు, శంకర్ జైకిషన్ అభిమానులకు మాత్రమే ఈ పాట తెలుస్తుంది. కానీ అతి చక్కటి పాట. వింటూ వుంటే అత్యద్భుతమైన పాటలా తోస్తుంది. హిందీ సినీ గేయ రంగంలో కలిగిన తిరుగులేని మార్పులకు సూచన ఈ పాట. ఈ పాటకు ముందు, ఈ పాట తరువాతగా హిందీ సినీగేయ చరిత్రను విశ్లేషించవచ్చు. కానీ ఈ పాట ప్రాధాన్యం హిందీ సినీ చరిత్ర విశ్లేషణలలో కనిపించదు. అందుకు ప్రధాన కారణం సినీ ప్రపంచంలో విజయానికే ప్రాధాన్యం. పరాజయాన్ని విస్మరిస్తారు.

**అజీబ్ దాస్తాన్ హై యే**
**కహా షురూ కహా ఖతమ్**
**యె మంజిలే హై కౌన్ సీ**
**న వో సమఝ్ సకే న హమ్!**

'దిల్ అప్నా ఔర్ ప్రీత్ పరాయా' సినిమాలోని ఈ పాట ఈనాటికీ సజీవంగా ఉంది. సినీ గీతాల ప్రేమికులను అలరిస్తూనే ఉంది. లత హిట్ పాటల సంకలనంలో 'లగ్ జాగలే' పాటతో సమానంగా వినిపిస్తుంది ఈ పాట. ఇదే బాణీకి విభిన్నమైన వాయిద్యాల కదలికను జోడించి మహమ్మద్ రఫీ స్వరంలో పాటించాడు శంకర్ జైకిషన్ ఒక దశాబ్దం తరువాత . ఫలితం కూడా భిన్నమైదే.ఎవ్వరికీ తెలియకుండా అనామకంగా ఉండిపోయిందీ పాట. 1973లో విడుదలయిన 'దూర్ నహీ మంజిల్' సినిమాలోనిదీ పాట. సంజీవ కుమార్ తాగిన మత్తులో పాడతాడు ఈ పాట.

1949లో శంకర్ జైకిషన్ సంగీత దర్శకత్వం వహించిన తొలి సినిమా 'బర్సాత్' విడుదలయింది. ఆ సినిమాలో పాటలు ఎంతగా 'హిట్' అయ్యాయంటే హిందీ సినీ గీతాల రూపకల్పన సంవిధానం సంపూర్ణంగా మారిపోయింది. ఆకర్షణీయమైన బాణీల సృజనతో పాటు ఆకర్షణీయమైన ఆర్కెస్ట్రా వైపు దృష్టి మళ్లింది. గీత రచన రూపు రేఖలు

మారిపోయాయి. గాయనిగా లత తెరపైకి వచ్చి తనదైన ప్రత్యేక ముద్ర వేసింది పాటలు పాడే విధానంపై. తొలిసారిగా పాటల రికార్డుల అమ్మకాలు సినిమా విలువను పెంచి మరింత ఆకర్షణీయం చేయటంలో పాటల ప్రాధాన్యాన్ని స్పష్టం చేయటంతోపాటు పాటల రికార్డుల అమ్మకాలు సినీ రంగంలో పోటీపడే వ్యాపార రంగంగా ఎదగడానికి 'బర్సాత్' బీజం వేసింది. ఆ తరువాత 22 ఏళ్లు, అంటే 1971 వరకూ సినీరంగాన్ని ఏలారు శంకర్ జైకిషన్. వారి పేరు కనిపిస్తే చాలు హీరోయీరోయిన్లతో సంబంధం లేకుండా ప్రేక్షకులు సినిమాలకు పరుగులు పెట్టేవారు.

శంకర్ జైకిషన్ సంగీత దర్శకత్వం వహిస్తున్నారంటే, మిగతా ఏమీ పట్టించుకోకుండా పెట్టుబడిదార్లు గుడ్డిగా పెట్టుబడులు పెట్టేవారు. కొత్త నిర్మాతల బ్యానర్లు అగ్రశ్రేణి బ్యానర్లుగా ఎదిగి స్థిరపడటంలో శంకర్‌జైకిషన్ సంగీతం ప్రధాన పాత్ర పోషించింది. అనామక నటీనటులు అగ్రశ్రేణి నటీనటులుగా ఎదగటంలో శంకర్ జైకిషన్ పాటలు ఊపునిచ్చాయి. నటీనటుల హావభావాలను అర్థం చేసుకుని, వారికి తగ్గ నేపథ్య గాయకుడి స్వరాన్ని ఎంచుకుని, వారికి కుదిరే బాణీలను కుదిర్చేవారు శంకర్ జైకిషన్. పెద్ద పెద్ద నిర్మాణ సంస్థల అధికారులు శంకర్ జైకిషన్‌ల ముందు బారులు తీరి నిలుచుని వారి దృష్టి తమపై ప్రసరించేందుకు ఎదురు చూసేవారు. కొత్త నటులను హీరోగా ఎంచుకునేందుకు నిర్మాతలు శంకర్‌జైకిషన్‌లను సంగీత దర్శకత్వం వహించేందుకు ఒప్పించమన్న నియమం విధించేవారు. 1950లలో లత స్వరంతో, 1960లలో మహమ్మద్ రఫీ స్వరంతో శంకర్ జైకిషన్లు సంగీత సరస్వతికి నీరాజనాలు అర్పించేంత అత్యద్భుతమైన స్థాయి గీతాలను సృజించారు. పండిట్ రవిశంకర్ విదేశాలలో 'ఫ్యూజన్ మ్యూజిక్' ఆలోచన బీజం నాటకముందే భారతీయ సినీరంగంలో పాశ్చాత్య, భారతీయ సాంప్రదాయక, జానపద బాణీల మిళితమైన అపూర్వమైన గేయ సృజనకు శ్రీకారం చుట్టారు విజయవంతంగా శంకర్ జైకిషన్.

కానీ, పైకి ఎగిరిన ప్రతిదీ క్రిందకు పడక తప్పదన్నట్టు 1971 వచ్చేసరికి శంకర్‌జైకిషన్ సంగీత భవంతి కుప్పకూలిపోయింది. దీనికి కారణాలు అనేకం. 1971లో శంకర్ జైకిషన్‌లలో జైకిషన్ మరణంతో శంకర్ జైకిషన్‌ల ఆధిక్యం అంతం అయింది. శంకర్ జైకిషన్‌ల జంటను దెబ్బతీసేందుకు జరిగిన దుష్ప్రచారాలలో శంకర్ కన్నా జైకిషన్ అధిక సృజనాత్మకత కలవాడనీ, హిట్ పాటలన్నీ జైకిషన్ సృజించినవే అనీ జరిగిన ప్రచారం దుష్ప్రభావం జైకిషన్ మరణం తరువాత తీవ్రంగా ప్రస్ఫుటమయింది. హిట్ గీతాలందించే జైకిషన్ మరణించాడు. దాంతో శంకర్ ఒక్కడే హిట్ పాటలనివ్వలేడనీ, వారి ఆధిక్యం అంతం అయిపోయిందనీ సినీరంగంలో విపరీతంగా ప్రచారం జరిగింది. దీనికి తోడు శంకర్ జైకిషన్‌ల నడుమ పొడసూపిన విభేదాల వల్ల కొన్నేళ్లు వారిద్దరూ విడివిడిగా సినిమాలు ఒప్పుకుని వేర్వేరుగా సంగీత దర్శకత్వ బాధ్యతలు వహించారు.

వాటిల్లో జైకిషన్ సంగీత దర్శకత్వం వహించిన సినిమాలు 'హిట్' అయి శంకర్ సంగీత దర్శకత్వం వహించిన సినిమాలు పరాజయం పాలవటంతో ఈ ప్రచారంలో ఉన్న పొరపాటు స్థిరపడింది. చివరికి ఇద్దరూ రాజీపడి మళ్లీ కలసి

సంగీత దర్శకత్వం వహించటం ఆరంభించగానే జైకిషన్ మరణించాడు. అంతకు ముందే శంకర్ కు అధికంగా పాటలు రాసిన శైలేంద్ర మరణించడంతో బీటలు వారిన భవంతి జై కిషన్ మరణంతో పూర్తిగా దెబ్బ తిన్నది. దీనికి తోడు జైకిషన్ మరణంతో మానసికంగా క్రుంగిపోయిన శంకర్ కొన్నాళ్లు సినీ సంగీత దర్శకత్వానికి దూరంగా ఉన్నాడు. ఇది చాలు సినీ ప్రపంచానికి ఒక కళాకారుడిని తొక్కేసి మరుగు పరచటానికి. జరుగుతున్నదేమిటో అర్థమయ్యేలోగా, శంకర్ జైకిషన్ సంగీత దర్శకత్వం వహించాల్సిన సినిమాలు ఇతర సంగీత దర్శకులకు వెళ్లిపోయాయి. గంగ మంగ, షోలే వంటి సినిమాలకు ముందుగా ఎంపికయిన సంగీత దర్శకులు శంకర్ జైకిషన్. కానీ ఇవి 'ఆర్డీ బర్మన్' పాటల రూపకల్పనలో అంతిమంగా విడుదలయ్యాయి.

జైకిషన్ మరణంతో శంకర్ పనయిపోయిందని, జైకిషన్ లేకుండా శంకర్ స్వతంత్రంగా సంగీత దర్శకత్వం వహించలేడని విస్తృతంగా ప్రచారం జరిగింది. దీనికి తోడుగా శంకర్ జైకిషన్‌లు వేర్వేరుగా సంగీత దర్శకత్వం వహించినవి తక్కువ స్థాయి నిర్మాతల సినిమాలు. 1971లో 17 విడుదలయి, దాదాపుగా అన్నీ దెబ్బ తినడంతో ఆ భారం అంతా శంకర్‌పై పడింది. దాంతో 'శంకర్' అంటే 'పరాజయం' అన్న ప్రచారం తీవ్రమయి, శంకర్ జైకిషన్ సంగీత యాత్ర ముగిసి పోయే పరిస్థితి వచ్చింది. అలాంటి సమయంలో తనని తాను నియంత్రించుకుని బాధను అణచి పెట్టి మళ్లీ గీతాల సృజన ప్రపంచంలో తాను బ్రతికే ఉన్నానని తన ఉనికిని నిరూపించి, జైకిషన్ రహితంగా తన అస్తిత్వాన్ని ప్రకటించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది శంకర్‌కు.

**జబ్ దుష్మన్ హోగయ వక్త్, వక్త్ సే లడనా హీ హోగా**

**హర్ దర్ద్ దబాకర్ దిల్‌మె, తమాషా కర్‌నా హీ హోగా**

1984లో విడుదలయిన 'పాపీ పేట్ కా సవాల్ హై' సినిమాలో కిషోర్‌కుమార్ పాడిన ఈ పాట శంకర్ జైకిషన్ మానసిక స్థితిని పట్టుదలను స్పష్టం చేస్తుంది. విధి మనకు వ్యతిరేకమయినప్పుడు, ఎదురు నిలచి విధితో పోరాడాలి. బాధను హృదయంలో దాచిపెట్టి, మన కర్తవ్యం మనం చేస్తూ పోవాలి. శంకర్ అదే చేశాడు. మళ్లీ తన జట్టును కూడగట్టుకుని రికార్డింగ్ స్టూడియోలో అడుగు పెట్టాడు. 'దూర్ నహీ మంజిల్' సినిమా కోసం మహమ్మద్ రఫీ స్వరంలో 'అజీబ్ జిందగీ హైయే' పాటను రికార్డు చేశాడు. అంటే, జైకిషన్ మరణం తరువాత శంకర్ ఒంటరిగా శంకర్ జైకిషన్ బ్యానర్‌పై రికార్డు చేసిన మొదటి పాట ఇది అన్నమాట. పాట వింటుంటే అత్యద్భుతంగా ఉంటుంది. మహమ్మద్ రఫీ అత్యద్భుతంగా విషాదాన్ని తాగిన మత్తు ప్రభావాన్ని కలగలిపి పాడాడు. ఆర్కెస్ట్రేషన్ అత్యుత్తమంగా ఉంటుంది. అంజాన్ గేయ రచన చక్కగా ఉంటుంది. ఈ పాటలో ఆయన వాడిన 'కభీ ఖుషీ కభీగమ్' అన్న ప్రయోగం తరువాత ఎంతో ప్రచారం పొందింది. కానీ సమయం అనుకూలంగా లేకపోతే ఎంత గొప్ప సృజన అయినా కాలగర్భంలో కలసిపోతుందనేందుకు చక్కటి నిదర్శనం ఈ పాట.

'విచిత్రమయినది జీవితం. ఒకప్పుడు ఆనందం అయితే, మరొకప్పుడు విషాదం. ఎక్కడ ఉండే వాడిని. ఇప్పుడు ఎక్కడ ఉన్నాను? నా గమ్యం పూర్తిగా మారిపోయింది ' అంటూ సాగే ఈ పాట శంకర్ జైకిషన్‌లకే కాదు మహమ్మద్ రఫీకి కూడా వర్తిస్తుంది.

1950 దశకం అర్ధభాగం నుంచీ అగ్రశ్రేణి గాయకుడిగా ఎదిగిన మహమ్మద్ రఫీ 1960 దశకంలో ఎదురు లేని గాయకుడిగా స్థిరపడ్డాడు. ఏ హీరోకయినా నేపథ్యంలో రఫీ స్వరం భావాలు పలకాల్సిందే. ఏ హీరో హిట్ పాట తీసుకున్నా గుర్తుకు వచ్చేది రఫీ స్వరమే. నాయకులు విస్మృతిలో పడ్డారు. సంగీత దర్శకులను మరచిపోయారు. కానీ రఫీ పాటలు సజీవంగా నిలచి ఉన్నాయి. కొన్ని సినిమాల పేర్లు ఈనాటికీ గుర్తున్నాయంటే, మహమ్మద్ రఫీ పాటవల్లే. 'ది అడ్వెంచర్స్ ఆఫ్ రాబిన్ హుడ్' సినిమా పేరు గుర్తుందంటే కారణం 'మానా మెరే హసీన్ సనం' అన్న రఫీ పాటవల్లనే. 'పునర్మిలన్ ' సినిమా అనగానే గుర్తుకు వచ్చేది 'పాస్ బైఠో తబీయత్ బహల్ జాయెగీ' అన్న రఫీ పాటనే.

'ముఝే తుమ్ సే మొహబ్బత్ హై, మగర్ మై కహ నహీసక్తా' అన్న అద్భుతమైన పాట లేకపోతే 'బచ్పన్' అన్న సినిమా నామరూపాలు లేకుండా పోయేది. ఈ రకంగా 1960 దశకాన్ని మకుటంలేని మంచి మనసున్న మహారాజులా ఏలాడు మహమ్మద్ రఫీ . కానీ 1969 వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. నటన వదిలి ప్రొఫెషనల్ గాయకుడు అయాడు కిషోర్ కుమార్.

1969లో ఆరాధన సినిమాలో 'మేరే సప్నోంకి రానీ కబ్ ', 'రూప్ తెరా మస్తానా' వంటి పాటలతో కిషోర్ కుమార్ దూసుకు వచ్చాడు.అంతవరకూ అలవాటయిన రఫీ స్వరానికి భిన్నంగా ఉండటంతో కిషోర్ స్వరం పట్ల ఆకర్షణ పెరిగింది. 1971 వచ్చేసరికి రఫీ పాటలు చినుకులయితే, కిషోర్ పాటలు కుంభవృష్టి అయ్యాయి. ఆ సమయంలో కిషోర్ కుమార్ పాటలు తప్ప ఇతరులు ఏమి పాడినా ఎవరికీ వినబడలేదు. అలాంటి పరిస్థితిలో ఎలాగయితే శంకర్ జైకిషన్ పనయిపోయిందని ప్రచారం చేశారో, అలాగే రఫీ పనయిపోయిందని ఉధృతంగా ప్రచారం జరిగింది. దాంతో కిషోర్ హిట్ పాటల ముందు రఫీ మంచి పాటలు తేలిపోసాగాయి. అంటే, ఈ పాట 'అజీబ్ జిందగీ హై' పాటతో అటు శంకర్ జైకిషన్, ఇటు మహమ్మద్ రఫీలు తమ ఉనికిని, అస్తిత్వాన్నీ నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నమాట. ఈ పాట విజయవంతం కాకపోవటం ఆ హిందీ సినీ సంగీత చరిత్రలో కీలకమైన మలుపు. పాటలో లోపం లేదు. కానీ పాట విజయవంతం కాలేదు. ఎందుకంటే అత్యుత్తమ శిఖరంపై ఉన్నవారు తమ అస్తిత్వాన్ని నిలుపుకునే ప్రయత్నంలో పరాజితుల్లా ఆలోచిస్తూ పాడిన పాట ఇది కాబట్టి. 'వో మంజిలే బదల్ గయీ, కహాఁథె హం, కహా హై హం' ఇప్పుడు వారి గమ్యం ఉనికిని నిరూపించుకుని నిలబడగలగటం. శిఖరంపై ఉన్న వారు ఇప్పుడు విస్మృతి అంచులలో నిలచి తాము సజీవంగా ఉన్నామని నిరూపించుకోవాల్సి వస్తోంది. 'కహాఁథె హం, కహాహై హం'

ఇది నిన్నటి మాట. ప్రపంచం సుందర స్వప్నంలా అనిపించింది. ఇపుడు ఆ కల కాలి బూడిదయిపోయింది. మిగిలింది పొగ మాత్రమే. ఒక రకమైన పరాజయ భావన పాట ఇది. గత వైభవాన్ని తలచి వగచే పాట ఇది. ఈ పాట 1970 ఆరంభంలో ఒకప్పటి సినీ సంగీత దర్శకుల పరిస్థితికి దర్పణం పడుతుంది.నౌషాద్, రవి, మదన్‌మోహన్, ఎస్డీ బర్మన్‌తో సహా పలు సీనియర్ సంగీత దర్శకులు వెనక్కి పోతూంటే, కాలం వూపులో లక్ష్మీప్యారే, ఆర్డీ బర్మన్ వంటి యువ సంగీత దర్షకులు  ముందుకు దూసుకుపోతున్న పరిస్థితి. దాంతో సినీ సంగీత పరిశ్రమలో 'మాధుర్యం' కన్నా 'ఆకర్షణ' కే పెద్ద పీట వేసే 'పోటీ' ఆరంభమయింది. ఈ పోటీలో నిలవలేని ఒకప్పటి అగ్రశ్రేణి సంగీత దర్శకులు ఒకరొకరుగా తెరమరుగవటం ఆరంభమయింది. ఇది శంకర్ జైకిషన్‌ల విషయంలో మరింత ప్రస్ఫుటమయింది. తనలో ఇంకా ఎంతో సృజనాత్మకావేశం ఉన్నా జైకిషన్ మరణంతో శిఖరాన ఉన్న శంకర్ జైకిషన్ పాతాళపుటంచులను చేరాల్సి వచ్చింది. ఇదంతా కన్నుమూసి తెరచేలోగా అయిపోయింది.

**లబోం సె భీ హై ఎక్ హసీ**

**హమే  యె అష్క్ క్యూ దియే**

**గునాహ హమ్నే క్యా కియే**

**సజా మిలీ యె కిస్ లియే**

పెదవులపై చిరునవ్వు లాక్కుని కన్నీళ్లు ఎందుకు ఇచ్చారు? నేనేం నేరం చేశాను? కానీ శిక్ష విధించారు? విజయ శిఖరాలు అధిరోహించటమే సినీ కళాకారులు చేసే అతి పెద్ద నేరం. ఒక్కసారి విజయం సాధించరో వారిని క్రిందకు లాగిపారేయాలని సమస్త ప్రపంచం ప్రయత్నిస్తుంది. శంకర్ జైకిషన్, మహమ్మద్ రఫీల విషయంలో అదే జరిగింది.

**బడీ హై ఖుష్ నసీబ్ హం**

**హమే బడా గురూర్ థా**

**వో నషే క దౌర్ థా**

**వో ఝూటా ఏక్ సురూర్ థా**

'గురూర్, సురూర్' .... అతి చక్కటి పదాలను అత్యద్భుతంగా వాడాడు గేయ రచయిత . 'గురూర్ ' అంటే Ego, Pride, Glory అన్న అర్థాలు వస్తాయి. 'సురూర్' అంటే Pleasure, Joy, Cheerfulness అన్న అర్థాలున్నాయి. 'హమే బడా గురూర్ థా' నాకు ఎంతో గర్వం ఉండేది నేను ఎంతో వైభవాన్ని అనుభవించాను. 'వో ఝూటా ఎక్ సురూర్ థా' అదంతా అబద్దపు ఆనందం. అది అబద్దమయిన సుఖం. ఎందుకంటే అపుడు నేను అదృష్టవంతుడిని. పట్టిందల్లా బంగారం అవుతోంది. కాబట్టి నేను గొప్పవాడిని అనుకున్నాను. విజయం నాదే అనుకున్నాను. అదంతా నా గొప్పతనం అనుకున్నాను. కానీ అదొక మత్తుకాలం. అంతా తప్పుడు ఆనందం. పొరపాటు

అభిప్రాయం. కళ్లు మూసి తెరిచేలోగా 'ఎక్కడ ఉండాల్సిన వాడిని, ఎక్కడ ఉన్నాను అంటున్నాడు హీరో. ఇది ఇటు శంకర్ జైకిషన్‌కూ అటు రఫీకీ సరిపోతుంది.

శిఖరంపై ఉన్నప్పుడు విజయగర్వంతో శంకర్ ఎవ్వరినీ లెక్కచేయలేదు. దురుసుగా ప్రవర్తించాడు. పాటలు సూపర్ హిట్‌లవుతున్నంత కాలం అతని 'గురూర్'ను భరిస్తూ సినీ ప్రపంచం సమయం కోసం ఎదురు చూసింది. అది గ్రహించని శంకర్ తన ధోరణిలో తానున్నాడు. అందుకే అది ' నషే క దౌర్' విజయం మత్తులో పడి నిజానిజాలు గ్రహించలేకపోయాడు. తన కోసం బారులు తీరిన నిర్మాతలు, వినయం ప్రదర్శించే హీరోల వల్ల తనకు కలిగే సంతృప్తి 'ఝూటా ఏక్ సురూర్' అని గ్రహించలేకపోయాడు. నిజానిజాలు గ్రహించే సరికి శంకర్ ఒంటరిగా మిగిలాడు. చుట్టూ మూగిన వారంతా కొత్త అదృష్టవంతులను వెతుక్కుంటూ వెళ్లిపోయారు. శంకర్ ఒంటరిగా.

**జానే కహా గయే వొ దిన్, కహతె థె తెరి రాహమే, నజ్‌రోంకో హం బిఛాయేంగే**

అంటూ మిగిలిపోయాడు.

అయితే, రఫీ కానీ, శంకర్ కానీ నిరాశలో కృంగిపోలేదు. గత వైభవాన్ని తలుస్తూ విలపిస్తూ అంధకారంలో మునిగిపోలేదు. తమ అస్తిత్వాన్ని నిరూపించుకునేందుకు పోరాడారు. సన్నిహితులు, శ్రేయోభిలాషుల సహాయంతో మహమ్మద్ రఫీ, కిషోర్ కుమార్‌తో పోటీ పడి, మరణించే ముందు అగ్రస్థానాన్ని అందుకున్నాడు. 'ఆద్‌మీ ముసాఫిర్ హై, ఆతా హై జాతా హై, ఆతే జాతే రాస్తేమే యాదే ఛోడ్ జాతా హై' అని పాడుతూ తన జ్ఞాపకాలుగా అత్యద్భుతమైన పాటలు వదిలి వెళ్లాడు మహమ్మద్ రఫీ.

**అరే ముష్కిల్ హై హర్ కదమ్**
**కదమ్ కదమ్ పర్ లడ్ నా హీ హోగా**
**హర్ దర్ద్ దబాకర్ దిల్‌మే**
**తమాషా కర్‌నా హీ హోగా**

అని పాడుతూ శంకర్ అనాకానేక ప్రతిబంధకాలను ఎదుర్కొంటూ, తనకు శత్రువుల్లా ప్రవర్తిస్తున్న సినీ పరిశ్రమ ఒత్తిడిని పళ్ల బిగువున భరిస్తూ అందిన అవకాశాలను వాడుకోవాలని ప్రయత్నిస్తూ, చివరి క్షణం వరకూ పునర్వైభవాన్ని సాధించాలని కలలు గంటూ, పాటలు సృజిస్తూ, ఒకనాడు హఠాత్తుగా అదృశ్యమయిపోయాడు. అతను మరణించినట్టుగా కూడా, శవదహనం అయిన మరునాటికి కానీ ఎవరికీ తెలియలేదు. మొత్తం సినీ పరిశ్రమ ఒకప్పుడు సాష్టాంగ పడ్డ సంగీత దర్శకుడు, అనామకుడిగా, ఒంటరిగా మరణించాడు . శంకర్ జైకిషన్ జంట సృజించిన పాటలు ఈనాటికీ అందరినీ అలరిస్తూనే ఉన్నాయి. సినీ పరిశ్రమలో 'విజయం' తప్ప మరో అంశానికి విలువలేదని నిరూపిస్తూనే ఉన్నాయి.

కల్ ఖేల్ మే హమ్ హోన హో
గర్ దిశ్ మె తారే రహేంగే సదా
భూలేంగే తుమ్ భూలేంగే వో , పర్ హం తుమ్హారే రహేంగే సదా
రహేంగే యహీ, అప్నే నిషాన్, ఇస్కే సివా జానాకహా!

(వచ్చేనెల మరిన్ని మధురమైన పాటలతో కలుద్దాం.)

Click here to share your comments